నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
3 | మహబూబ్‌నగర్, గురువారం 28 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

# రాష్ట్రంలో తుగ్లక్ పాలన

- కేసీఆర్ వైపు ప్రజలు చూస్తున్నారు
- కాంగ్రెస్‌ను నమ్మి నట్టేట మునిగారు
- నాటి దీక్షా దివస్ తోనే రాష్ట్ర సాధన
- ఉద్యమ స్ఫూర్తి తోనే ప్రజల పక్షాన పోరాటం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తుగ్లక్ పాలనలో సాగుతున్నదని, కాంగ్రెస్ ఏడాది పాలనలోనే ప్రజలంతా ఉద్యమ నాయకుడు, రాష్ట్ర సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ వైపు ఆశతో చూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ సన్నాహక సమావేశం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి మాజీ జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాటి దీక్షా దివస్ స్ఫూర్తితో పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ పిలుపు మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా పదేండ్ల పాలనలో కేసీఆర్ నవనిర్మాణం చేశారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధి, పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూస్తే..అందరికీ అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు నట్టేట మునిగారని, దీక్షా దివస్ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలన్నారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రతో ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులను బలోపేతం చేస్తే..నేడు కాంగ్రెస్ హయాంలో రైతులు నలిగి పోతున్నారన్నారు. వచ్చే రోజుల్లో బీఆర్ఎస్‌కే రాష్ట్ర ప్రజల ఆదరణ ఉంటుందని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

## కేసీఆర్ వల్లే రాష్ట్రం ఏర్పడింది

- వనపర్తి ఇన్‌చార్జి సందీప్ రెడ్డి

నాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని యాదాద్రి భువనగిరి జెడ్పీ మాజీ చైర్మన్, వనపర్తి ఇన్‌చార్జి ఎలిమినేటి సందీప్ రెడ్డి అన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితో మన పార్టీ శ్రేణులలో ఉత్సాహం నింపుతూ కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలపై పోలడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పిన హామీలన్ని మరుగున పడ్డాయని, కాంగ్రెస్ అంటేనే ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. ప్రస్తుతం జనం నేడు కేసీఆర్‌వైపు చూస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ ప్రభంజనం ఖాయమన్నారు. నాయకులు, ఉద్యమ స్ఫూర్తితో దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని సందీప్ రెడ్డి పిలుపునిచ్చారు. కాగా, దీక్షా దివస్ కార్యక్రమం సందర్భంగా వనపర్తిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను ఒక్కొక్కరికీ బాధ్యతలను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అప్పగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, నాయకులు కురుమూర్తి యాదవ్, నందిమళ్ల అశోక్, విశ్వేశ్వర్, కృష్ణా నాయక్, రఘుపతిరెడ్డి, వనం రాములు, విజయ్, జాత్రు నాయక్, ఉస్మాన్, సేనాపతి, టీక్యా నాయక్ పాల్గొన్నారు.



# చతికిలపడ్డ కాంగ్రెస్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

- హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలం
- పదేండ్లల్లో కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేశారు
- ఎమ్మెల్సీ, దీక్షాదివస్ పేట జిల్లా ఇన్‌చార్జి కోటిరెడ్డి
- బీఆర్ఎస్ జెండా ఎగరాలి : మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం : మాజీ ఎమ్మెల్యే చిట్టెం

నారాయణపేట రూరల్, నవంబర్ 27 : తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక చతికిలపడిందని ఎమ్మెల్సీ, దీక్షాదివస్ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి కోటిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు కేసీఆర్.. 2009 నవంబర్ 29వ తేదీన 'తెలంగాణ వచ్చుడో.. సచ్చుడో' అని నినదించి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ఆ రోజు తీసుకున్న నిర్ణయమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది పడిందని, ఇది చరిత్రలో నిలిచిపోయే రోజుగా అభివర్ణించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలిపారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా గడవకముందే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. హామీలను అమలు చేయలేక పూర్తిగా విఫలమైందన్నారు. ఈ నెల 29వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే దిక్షాదివస్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖా హన్మిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ, మండలాలు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

### సీఎంను దూషిస్తున్న ప్రజలు : రాజేందర్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం కావడంతో ప్రతి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు దూషిస్తున్నారని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తెలిపారు. గతంలో జిల్లాకు ఎస్పీ కార్యాలయం మంజూరు చేశామని, కానీ అది ఇప్పుడు ఎక్కడ నిర్మిస్తున్నారో కూడా తెలియడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలన్నారు. రెండు వేల మంది పైచిలుకు కార్యకర్తలతో దీక్షాదివస్ కార్యక్రమాన్ని జిల్లా పార్టీ కార్యాలయంలో చేపడుతున్నామన్నారు. అదేరోజు నర్సిరెడ్డి చౌరస్తా నుంచి జిల్లా పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 9:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

### గాడితప్పిన ప్రజాపాలన : చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



రాష్ట్రంలో ప్రజాపాలన గాడి తప్పిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకు మాగనూర్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనే నిదర్శనమన్నారు. వారంలో మూడుసార్లు ఇలా జరిగిందని.. విద్యార్థులతో ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులను పరామర్శించడానికి వెళ్తే బుధవారం తెల్లవారుజామున అక్రమంగా అరెస్ట్ చేసి మద్దూర్‌కు తరలించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే తలతిక్కగా మాట్లాడుతున్నాడని, అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదని, తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా మేమంతా అండగా ఉంటామన్నారు.

# ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్న విద్యార్థులు



ఇంటి నుంచి టిఫిన్ తెచ్చుకున్న టిఫిన్ బాక్సులను చూపిస్తున్న విద్యార్థులు

మక్తల్, నవంబర్ 27 : మాగనూర్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురై బుధవారం ఉదయం స్కూల్‌కు వచ్చే సమయంలో ఇంటినుంచే బాక్సులు తెచ్చుకున్నారు. వాటినే మధ్యాహ్నం భుజించారు. వారిని 'నమస్తే తెలంగాణ' బృందం పలకరించగా.. వారం రోజులుగా ఫుడ్‌పాయిజన్ అవుతుండడంతో అన్నం తినాలంటే భయమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో 590 మందికి గాను 338 విద్యార్థులు హాజరు కాగా.. చాలా మంది ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్నే తిన్నారు.

# మాగనూర్ ఘటనపై హైకోర్టు ఆగ్రహం

ఊట్కూర్, నవంబర్ 27 : మాగనూర్ పాఠశాలలోని ఫుడ్ పాయిజన్ వరుస ఘటనలపై బుధవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం వ్యవధిలోనే మూడు సార్లు ఫుడ్ పాయిజన్ అయితే అధికారులు నిద్రపోతున్నారా..? అంటూ ప్రశ్నించింది. పిల్లలు చనిపోతే తప్పా స్పందించరా? అని ప్రభుత్వ అడ్వకేట్‌ను కోర్టు ప్రశ్నించింది. వారం వ్యవధి కోరగా.. నాన్ బెయిలబుల్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో అధికారులు ఇక్కడకు వచ్చి రిపోర్టు చేస్తారంటూ ఫైర్ అయినట్లు తెలిసింది. ఈ ఘటనపై అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించింది. భోజనంలో బొద్దింకలు, బల్లులు వస్తున్నాయని.., ప్రభుత్వం ఘటనను సీరియస్‌గా తీసుకోవడం లేదని, పిల్లలకు నాణ్యమైన భోజనం ఎందుకు అందించడం లేదని, పూర్తి వివరాలపై నివేదిక అందించాలని ఆదేశించింది.

# స్టూడెంట్స్‌తో పూరీల తయారీ

- నవాబ్‌పేట కేజీబీవీలో విద్యార్థినులతో పనులు
- వేడి నూనె మీద పడి ఒకరికి గాయాలు
- ఇన్‌చార్జి ఎస్‌వోకు మెమో జారీ

నవాబ్‌పేట, నవంబర్ 27 : చదువుకోవాల్సిన విద్యార్థినులతో పూరీలు చేయిస్తుండగా.. వేడి నూనె మీద పడి విద్యార్థినికి గాయాలైన ఘటన నవాబ్‌పేట కేజీబీవీలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కేజీబీవీ విద్యార్థినులకు ప్రతి మంగళవారం సాయంత్రం పూరీలు వడ్డిస్తారు. ఇందులో భాగంగానే వర్కర్లు మాత్రమే పూరీలు చేస్తే త్వరగా పూర్తి కావనే ఉద్దేశంతో.. టీచర్లు కొంతమంది విద్యార్థినులతో కూడా పనులు చేయించారు. కాగా, పూరీలు కడాయిలో వేసే క్రమంలో వేడి నూనె చిట్లి 9వ తరగతికి చెందిన జల్సా అనే అమ్మాయిపై పడింది. దీంతో విద్యార్థిని చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. మంగళవారం ఘటన చోటు చేసుకోగా బుధవారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని తల్లి యాదమ్మ పాఠశాలకు వచ్చి అమ్మాయిని తీసుకెళ్లి వైద్యం చేయించి స్వగ్రామమైన జంగమయ్యపల్లికి తీసుకెళ్లింది. యాదమ్మ మాట్లాడుతూ పిల్లలు బాగా చదివి ప్రయోజకులు అవుతారని పాఠశాలకు పంపిస్తే పనులు చేయించడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల ఇన్‌చార్జి ఎస్‌వో ప్రశాంతిని వివరణ కోరగా.. వర్కర్లు పని చేస్తుండగా జల్సా అనే అమ్మాయి పూరీలు అందించే క్రమంలో కాగిన వేడి నూనె పడడంతో స్వల్ప గాయాలయ్యాయన్నారు. విద్యార్థినికి ప్రథమ చికిత్స అందించి తల్లి వెంట ఇంటికి పంపించినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, డీఈవో ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎస్‌వోకు మెమో జారీ చేసినట్లు ఎంఈవో నాగ్యానాయక్ తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే చిట్టెం ముందస్తు అరెస్ట్

- మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- పలువురు బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు
- అక్రమ అరెస్టులను నిరసిస్తూ కార్యకర్తల ఆందోళన



పోలీస్ వాహనంలో నుంచి దిగుతున్న చిట్టెం

మక్తల్, నవంబర్ 27: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం మరోసారి ఫుడ్ పాయిజన్ జరిగి 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై మక్తల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాగనూర్ వెళ్తారని, విద్యార్థులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తారని అనుమానంతో మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో ఆయన్ని ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం ఆ నారాయణపేట జిల్లా కేంద్రానికి అటు నుంచి మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మాగనూరు పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి తీవ్ర అస్వస్థతకు గురై మక్తల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి వారి ఆరోగ్యం కుదుటపడే వరకు దవాఖానలోనే ఉండడం జరిగిందన్నారు. బుధవారం మాగనూరుకు ఎక్కడ వెళ్తారో అని పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రభుత్వ ఆదేశాల మేరకు తెల్లవారు జామున అరెస్టు చేసి ఆ స్టేషన్ ఈ స్టేషన్ తిప్పుకుంటూ చివరకు మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రశ్నిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతును నొక్కాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. అరెస్టు చేసినంత మాత్రానా భయపడేది లేదని, విద్యార్థులకు మద్దతుగా ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం తోపాటు బీఆర్ఎస్ నాయకులు చిన్నహనుమంతు, రాజుల ఆశిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహులుగౌడ్‌ను కూడా ముందస్తు అరెస్టు చేసి మక్తల్ నియోజకవర్గంలోని నర్వ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం అక్రమ అరెస్టును నిరసిస్తూ మక్తల్‌తోపాటు అమరచింత మండలకేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు నిర్వహించారు. మక్తల్‌లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వాహనాల్లోకి ఎక్కించి పోలీస్‌స్టేషన్ తరలించారు.

### తప్పులను కప్పి పుచ్చుతున్నారు..



మా పిల్లలకు బడికి పంపేటప్పుడు డబ్బులు ఇస్తలేం. అలాంటిది స్కూల్ వద్ద బయటి వస్తువులు ఎట్లా కొంటరు. ప్రభుత్వం తమ తప్పులు తెలియకుండా మా బిడ్డల మీద వేస్తున్నారు. నాసిరకం బియ్యం, సరిగా ఉడకని అన్నం పెట్టడంతో మధ్యాహ్నం తిండి మాని ఇంటికి వస్తున్నారు. బడిలో తాగునీళ్లు కూడా లేవు.

– కిష్టమ్మ, మాగనూరు, (అస్వస్థతకు గురైన 7వ తరగతి విద్యార్థిని స్వాతి తల్లి )

### పిల్లలకు డబ్బు లివ్వడం లేదు..



బడిలో పిల్లలకు ఉడకని వంకాయ, ఆలుగడ్డతో వండిన కర్రీ వడ్డించిండ్రు. అది తినడం తోనేమా బిడ్డ సంగీతకు వాంతులు, కడుపునొప్పి వచ్చింది. ప్రభుత్వం పిల్లలకు భోజనం పెట్టడం చేత కాక పోతే మానుకోవాలి. అంతే కాని పిల్లలకు బయట చిరుతిండ్లు తింటున్నారని వారిపై నెట్టడం భావ్యం కాదు. మా వద్ద డబ్బులు ఉంటే కదా బడికి వెళ్లే సమయంలో పిల్లలకు ఇచ్చి పంపుతాం. అధికారులు పిల్లలపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నరు.

– శంకరమ్మ, విద్యార్థిని తల్లి, మాగనూరు

# పర్యవేక్షించినా.. ఫలితం శూన్యం

మాగనూరు పాఠశాలలో వరుస ఘటనలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర విద్యా సంచాలకుడు, నారాయణపేట కలెక్టర్

- ఫుడ్‌పాయిజన్‌పై తలా ఒక సమాధానం
- విద్యార్థులపైకి నెట్టేందుకు ప్రయత్నాలు
- అధికారుల మాటలను తప్పుపడుతున్న తల్లిదండ్రులు
- పోలీస్ పహారాలో స్కూల్ నిర్వహణ



విచారణ చేపడుతున్న రాష్ట్ర విద్యా సంచాలకుడు నరసింహారెడ్డి

ఊట్కూర్/మాగనూరు, నవంబర్ 27 : మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారంలో మూడుసార్లు ఫుడ్‌పాయిజన్ అయిన ఘటన కలకలం రేపుతున్నది. అధికారులు నిత్యం పర్యవేక్షణ జరుపుతున్నా ఫలితం లేకుండా పోతున్నది. కాగా, కలుషితాహారంపై అధికారులు తలా ఒక సమాధానం చెబుతున్నారు. విద్యార్థులపైకి నెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అధికారుల మాటలను విద్యార్థుల తల్లిందండ్రులు తప్పు పడుతున్నారు. తాము పిల్లలకు డబ్బులే ఇవ్వనప్పుడు దుకాణాల్లో చిరుతిండ్లు ఎలా కొనుగోలు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. వీటికి అధికారుల నుంచి సమాధానం లేకుండా పోతున్నది. తాము ఏమైనా చిన్నపిల్లలమా..? కుర్‌కురేలు తిన డానికి..? అంటూ విద్యార్థులు నిలదీస్తున్నారు. మాగనూరు పాఠశాలలో వారం రోజులుగా అధికారుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం వండిస్తున్నప్పటికీ మంగళవారం 30 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి రావడంతో ఉపాధ్యాయులు తమ వాహనాల్లో విద్యార్థులను చికిత్స కోసం మక్తల్ దవాఖానలో చేర్పించారు. తమకు ఉడకని వంకాయ, ఆలు గడ్డకర్రీ వడ్డించారని, అన్నంలో సైతం పురుగులు వచ్చినట్లు చికిత్స పొందుతున్న విద్యార్థులు చెబుతున్నారు. కానీ, అధికారులు మాత్రం విద్యార్థులు దుకాణాల్లో దొరుకుతున్న కుర్‌కురేలు, బిస్కెట్లు, చాక్లెట్లు, పొలాల్లో కంది బుడ్డలు తినడంతో అస్వస్థతకు గురవుతున్నట్లు మీడియాకు లీకులిచ్చారు. ప్రభుత్వ వైఫల్యం నుంచి తల్లిదండ్రుల దృష్టిని మరల్చేందుకు పోలీసులను రంగంలోకి దించి చిరు దుకాణాలు, కిరాణా షాపుల్లో సోదాలు జరిపించారు.

#### పాఠశాల వద్ద 144 సెక్షన్..

అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు వివిధ పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు వస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు.. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో తాసీల్దార్ సురేశ్ కుమార్ పాఠశాల ఆవరణ చుట్టూ 144 సెక్షన్ విధించారు. అయితే, మండల కేంద్రానికి చేరుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగూరావు నామోజీ, ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్ విద్యాసాగర్, మండలాధ్యక్షుడు నారాయణ, నాయకులు అశోక్ గౌడ్‌తోపాటు దాదాపు 42 మందిని పాఠశాలకు 200 అడుగుల దూరంలోనే డీఎస్పీ లింగయ్య అరెస్టు చేసి మాగనూరు, మక్తల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. జంక్‌ఫుడ్ వల్ల ఫుడ్ పాయిజన్ అయిందని తప్పుడు ప్రచారం చేసిన కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

### చిరుతిండ్ల వల్లే అస్వస్థత

- ఫుడ్ పాయిజన్‌పై విచారణ చేస్తున్నాం
- రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి

మక్తల్/మాగనూరు, నవంబర్ 27 : మాగనూరు పాఠశాలలో కందికాయ, కురుకురేల వంటి చిరుతిండ్లు తినడంతో వాంతులు, విరేచనాలు అయ్యాయని విద్యార్థులు చెప్పారంటూ రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు ఈవీ.నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం నర్సింహారెడ్డి. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి పాఠశాలకు చేరుకొని సమగ్ర విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనానికి వాడే బియ్యాన్ని పరిశీలించి, సామగ్రిలో నాణ్యత ఉందా? లేదా? అనే విషయాలను కుణ్ణంగా పరిశీలించి.. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వంటకు ఉపయోగించే నీటి నమూనా, బియ్యం స్టోరేజీ గది, వంట సామగ్రిని తనిఖీ చేసినట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీలో ఆరుగురు ఉపాధ్యాయులను చేర్చి విడుతల వారీగా ఒక్కొక్కరికి బాధ్యత అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నిత్యం భోజనానికి వాడే సామగ్రి, కూరగాయలను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకాలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం పాఠశాలలో ఇన్‌చార్జి తాసీల్దార్, ఎంపీడీవో, ఉపాధ్యాయులు.. 400 మంది విద్యార్థులతో కలిసి భోజనం చేశారని, వారిలో కేవలం 20 మంది మాత్రమే అస్వస్థతకు గురైనట్లు తేలిందన్నారు. ప్రస్తుతం వారు కోలుకొని కొంతమంది పాఠశాలకు రాగా మరికొందరు రాలేదన్నారు. మధ్యాహ్న భోజనంలో కలుషితం ఉంటే 400 మందిలో వందకు పైగా అస్వస్థత కావాలని.. కేవలం 20 మంది మాత్రమే అస్వస్థతకు ఎలా గురయ్యారన్నారు. ఈ విషయంపై విద్యార్థులతో అడగగా.. ఉదయం కందికాయ బుడ్డలు, కురుకురే ప్యాకెట్లను తెచ్చుకొనితిన్నామని, వాటి వల్లే ఫుడ్ పాయిజన్ అయ్యి ఉండొచ్చని నివేదికలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అయితే, వారంలో మూడుసార్లు పునరావృతం కావడంతో విద్యార్థుల్లో మనోధైర్యం తగ్గిందని, అందుకే బుధవారం 338 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. వారిలో మనోధైర్యాన్ని పెంచేందుకే కలెక్టర్, ఎస్పీ, తాను విద్యార్థులతో కలిసి భోజనం చేశామన్నారు. వారం కిందట జరిగిన కలుషిత ఆహార ఘటనపై విచారణ చేశామని, బయటి నుంచి తెచ్చిన నాసిరకం గుడ్లతో కొంత సమస్య వచ్చిందన్నారు. గుడ్ల తోపాటు దుకాణాల్లోని తినుబండారాలను తనిఖీ చేసి ల్యాబ్‌కు పంపించామన్నారు. ఇకపై ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్ గౌతమ్, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్ తదితరులు ఉన్నారు.

# ఆకలితో అలమటించిన విద్యార్థులు



ఆకలితో ఏడుస్తున్న విద్యార్థిని

రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి.. కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి మాగనూర్ పాఠశాల పరిసరాలను బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి వాడిన బియ్యాన్ని, వంటగదిని పరిశీలించి.. నాణ్యమైన వస్తువులను వాడుతున్నారా..? లేదా అనే విషయంపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12:30 దాటినా విద్యార్థులకు భోజనం పెట్టలేదు. దీంతో 12:45 కు ఏడో తరగతి విద్యార్థిని అను ఆకలితో క్లాస్ రూంలో అలమటిస్తుండగా డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి గుర్తించి పాఠశాల బయటకు తీసుకెళ్లారు. సదరు విద్యార్థిని ప్రజలను చూసి భయభ్రాంతులకు గురై తిరిగి క్లాస్ రూముకు వెళ్లి ఆకలితోనే కూర్చున్నది.చివరికి 12:57కు విద్యార్థులను భోజనానికి వదిలారు.

### ఎంఈవో సస్పెన్షన్..

మక్తల్, నవంబర్ 27 : మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థతకు గురికావడంతో విధుల్లో నిర్లక్ష్యానికి ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన మురళీధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. మాగనూర్ ఎంఈవోగా అనిల్‌గౌడ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.